మళ్లీ షురూ అయింది..

పెద్దాస్పత్రిలో మొదటికొచ్చిన పార్కింగ్ సమస్య

- ప్రత్యేక స్థలం ఏర్పాటుచేసినా ఫలితం సున్నా
- ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేతతో ఇక్కట్లు





ఆస్పత్రిలో ఆవరణలో పార్క్ చేసిన వాహనాలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థ గాడినపడేట్టు కనిపించట్లేదు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయటం సర్వసాధారణమైపోయింది. ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసినా దానిని ఎవరూ వినియోగించకపోవడంతో ఆస్పత్రి ఆవరణమంతా వాహనాలతో నిండిపోయి ఇబ్బందికరంగా తయారైంది. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వివిధ ప్రాంతాల నుండి వచ్చేరోగులతో పాటు వారి సహాయకులు, ఉద్యోగులతో నిత్యం కిటకిటలాడుతుంటుంది. దీంతో ఆస్పత్రి ఆవరణమంతా వాహనాలతో రద్దీగా దర్శనమిస్తుంటుంది.

పట్టింపులేనట్లుగా వాహనదారులు...

పెద్దాస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థ అధ్వానంగా తయారవడంతో పలు రకాల సమస్యలు ఎదురవుతున్నాయి. ఎక్కడబడితే అక్కడ పార్కింగ్‌తో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి ఆవరణలో వాహనాల అడ్డగోలు పార్కింగ్‌తో రోగులు ఆవరణలో కనీసం కూర్చునే అవకాశం లేకుండా పోతోంది. అంతే కాకుండా అడ్డగోలు పార్కింగ్‌తో అత్యవసర రోగులను తీసుకువచ్చే అంబులెన్స్‌లకు కూడా ఒక్కోసారి దారి దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు వాహనాలు ఒక దాంట్లో ఒకటి ఇరుక్కుపోయి వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. సెక్యూరిటీ గార్డులను సరిపోను కేటాయించకపోవటంతో ఎవరు ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వైద్య సేవలకు రాని వారు కూడా ఆవరణలో పార్క్ చేసి వెళ్తున్నారు. పార్కింగ్ వ్యవస్థను నియంత్రించే వారు లేకపోవటంతో ఆస్పత్రి ఆవరణమంతా వాహనాలతో నిండిపోతోంది.

రెండెకరాలు కేటాయించినా..

ఆస్పత్రిలో పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అప్పటి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వాహనాలు అన్నింటిని ఒక దగ్గరే పార్క్ చేసేలా ఆస్పత్రి వెనుకభాగాన ప్రత్యేక స్థలం కేటాయించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో అప్పట్లో రెండెకరాలను చదును చేయించి పార్కింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కొంత కాలం వాహనాలను ఆస్పత్రి ఆవరణలో నిలపకుండా, ప్రతీ వాహనాన్ని ప్రత్యేక పార్కింగ్ స్థలంలో పార్క్ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆస్పత్రి చుట్టూ సెక్యూరిటీ గార్డులను పెట్టి ఎక్కడా వాహనం నిలపకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలానికి తరలించారు. కానీ కొంత కాలం వరకు బాగానే సాగినా ఆ తర్వాత యథాస్థితికి వచ్చింది.



పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం

కేటాయించిన స్థలంలోనే పార్కింగ్..

ఆస్పత్రి వెనుక భాగంలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశాం. ఇటీవల దాన్ని వినియోగించకుండా ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. దీనిపై చాలా సార్లు సెక్యూరిటీ ఏజన్సీకి తెలిపాం. ఇకపై ఉపేక్షించేది లేదు. సరిపోను సెక్యూరిటీ గార్డులను కేటాయించి ప్రత్యేక పార్కింగ్ వద్దనే అన్ని వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకుంటాం.

– బి.రాంబాబు, ఆస్పత్రి ఆర్ఎంఓ

పేదలకు అండగా పాలన..

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సుబ్లేడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో పేదలకు అండగా నిలిచేలా తమ ప్రభుత్వం పథకాలను అమలుచేస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని అజ్మీరా తండా, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, హైలెవల్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్లతో పాటు సుబ్లేడులో ఇంటిగ్రేటెడ్ ఎస్టీ హాస్టల్ నిర్మాణ పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు, రేషన్‌కార్డుల జారీతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి ఇల్లు మంజూరు చేయడమే తమ లక్ష్యమని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చినా రైతుల రుణమాఫీ చేయడంతో పాటు రైతుభరోసా అమలు చేశామని తెలిపారు. కాగా, సుబ్లేడు కేంద్రం కొత్త మండలం కావాలని స్థానికులు ఆందోళన చేస్తుండగా, వారితో మాట్లాడిన మంత్రి ఆలోచనను పరిగణనలోకి తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు ఎస్.విజయలక్ష్మి, పవార్, మహేష్, హరీష్‌కుమార్, విన్సెంట్‌రావు, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్‌తో పాటు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, బెల్లం శ్రీనివాస్, ఇజ్రాయిల్, అశోక్, మంగీలాల్, అశోక్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం..



పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటిని ఖమ్మంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజెఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఆధ్వర్యాన కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీతో పాటు ఖమ్మంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు వెన్నబోయిన సాంబశివరావు, శెట్టి రజినీకాంత్, బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, ఉదయ్, చక్రవర్తి, విజేత, ఉపేందర్, హరీష్, శ్రీధర్ శర్మ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుద్దేటి రమేష్‌బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఏడీఏ సతీష్



కూసుమంచి: కూసుమంచి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ)గా మిట్లపల్లి సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీఏ సరిత పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆత్మా పీడీగా బదిలీ కాగా ఆమె స్థానంలో ఖమ్మం రైతుశిక్షణ కేంద్రం ఏడీఏ సతీష్ ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఏడీఏకు ఏఓలు, ఏఈఓలు శుభాకాంక్షలు తెలిపారు.

మెకానిక్ కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పట్టణానికి చెందిన టూ వీలర్ మెకానిక్ కుటుంబానికి తోటి మెకానిక్‌లు సోమవారం ఆర్థికసాయంతో చేయూత అందించారు. నగరంలో మెకానిక్‌గా పనిచేస్తున్న బుజ్జి నవీన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు ఖమ్మం పట్టణ మెకానిక్‌లు రూ.30,000 సేకరించగా, తెలంగాణ రాష్ట్ర టూ వీలర్ యూనియన్ ఉపాధ్యక్షుడు జాఫర్ రూ.10,000 అందించారు. మొత్తం రూ.40,000 నగదును బాధిత కుటుంబానికి మండే నరసింహారావు, జాఫర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లింగనబోయిన మురళి, కోశాధికారి బల్లి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మండే శ్రీనివాసరావు, శివరామకృష్ణ, గౌరీ ప్రసాద్, అన్నదేవర భద్రయ్య, ఉపేందర్, దేవేందర్ కుమార్, రబ్బాన్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల బకాయిలను సత్వరమే చెల్లించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు విన్నవించామన్నారు. భాస్కరాచారి, వీరభద్రరావు, మేరీ, అన్నమ్మ, రాజ్యలక్ష్మీ ఉన్నారు.

సన్మానం



ఉమామహేశ్వరచార్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం బైపాస్ రోడ్డు ఎంబీ గార్డెన్ పక్కనున్న శివాలయం అర్చకులు సత్తెనపల్లి ఉమామహేశ్వరచార్యకు చెన్నై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉమామహేశ్వర చార్య దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదేపల్లి కృష్ణమాచారి, జిల్లా అధ్యక్షురాలు నలమాస సుగుణ, గద్ద వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, రమేష్, సంతోష్, రమాదేవి తదితరులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	తమ్ముడు
వినోద	జురాసిక్ వరల్డ్
సాయిరాం	ఓ భామ అయ్యో రామ
ఆదిత్య	సూపర్ మ్యాన్
శ్రీనివాస	కుబేర

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	80		20
కాకర	50	చుక్కకూర	3
బోడ కాకర	260		20
బీర	46	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	46	గోంగూర	4
చిక్కుడు	76		20
గోరుచిక్కుడు	56	మెంతికూర	3
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	50		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఏఎంఓ రాజశేఖర్

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో పీఎం శ్రీలో భాగంగా సైన్స్, మ్యాథ్స్, బయాలజీ, బోధించే ఉపాధ్యాయుల కోసం అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఏఎంఓ రాజశేఖర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల రోబోటిక్స్‌పై విషయ నైపుణ్యాలను పెంచుకుంటేనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. ప్రసాద్, డీఎస్ఓ జగదీశ్వర్, పీపీలు శివ, కిరణ్, మానస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వేతనాలు ఇవ్వాలని ధర్నా

నేలకొండపల్లి: ఆస్పత్రిలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ఇవ్వాలని హాస్పిటల్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడారు. మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకట్, హీరాలాల్, ఎస్‌కె.సైరా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



బ్యాగులు అందజేస్తున్న ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బి.చలపతిరావు అన్నారు. మండలంలోని అప్పలనరసింహాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన సాయిమాధవ్, లీలా బ్యాగ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కేఎన్‌వీఎల్.భవాని, అమ్మ కమిటీ చైర్మన్ లూర్దు మేరీ, నాయకులు వెనికె జానకిరామయ్య, మన్నె నగేష్, బందెల ప్రసాద్, వీరబాబు, శ్రీనివాసరావు, శేషయ్య, భాస్కర్‌రావు, గోవిందరావు, ఉపాధ్యాయులు కిషన్‌నాయక్, రామ్మూర్తి ఉన్నారు.

తాటి, ఈత మొక్కలు సరఫరా చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: గ్రామాల్లోని చెరువు కట్టలపై తాటి, ఈత వనాలు పెంచుకోవడానికి ప్రభుత్వం ఉచితంగా మొక్కలు సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని, గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లు గీత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న కార్మికుల ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలన్నారు. కేవలం వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని రకాల పథకాలను వర్తింపజేయాలన్నారు. బోనేపల్లి సంగయ్య, గడ్డమీద వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి ఉపేందర్, మంగురు ముత్తయ్య, మొక్క నాగేశ్వరరావు, పంగ పవన్, కోటగిరి మల్లయ్య, సైదులు, మధు, రంగయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

అన్నదానం

ఖమ్మం అర్బన్ : నగరంలోని నాల్గవ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు దేవాలయ బాధ్యుడు, కార్పొరేటరు నాగండ్లకోటి తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు.

తీన్మార్ మల్లన్నపై దాడిపై ఖండన

కూసుమంచి: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై, అతని కార్యాలయంపై చేసిన దాడిని బీసీ సంఘం పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం రామకృష్ణ ఒక ప్రకటనలో ఖండించారు. ఎమ్మెల్సీ కవిత బీసీ ఉద్యమానికి మద్దతిస్తే ఆహ్వానిస్తామని, అలా కాకుండా బీసీ ఉద్యమకారులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని పేర్కొన్నారు.

ఆలయాల్లో పూజలు

ఖమ్మం అర్బన్: నగరంలోని పలు దేవాలయాల్లో సోమవారం సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్‌లోని శ్రీ బాలగణపతి ఆలయంలో ప్రధాన అర్చకులు గిరిధర్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. మధురానగర్‌కు చెందిన సాయి మందిరంలో, సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. ఈఓ వీవీ నరసింహారావు, ఆలయ అధ్యక్షుడు బాజిన్ని వీరయ్య, కార్యదర్శి తిరుపతిరావు, భక్తులు పాల్గొన్నారు.

ద్వి చక్రవాహనం చోరీ..

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన షేక్ చాంద్‌పాషాకు చెందిన ద్విచక్ర వాహనం చోరీ అయినట్లు బాధితుడు సోమవారం రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... రోజులాగే ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు నిలిపి సోమవారం ఉదయం చూస్తే వాహనం లేదు. ఎంత ఆరా తీసినా ఎక్కడా దొరక్క పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నేలకొండపల్లి: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరమని నేలకొండపల్లి వ్యవసాయ శాఖ అధికారి యం.రాధ సూచించారు. మండలంలోని పైనంపల్లిలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నానో యూరియాతో ప్రయోజనాలున్నాయని, అరలీటర్ నానోయూరియా ద్రావణం 45 కిలోల యూరియా బస్తాతో సమానమన్నారు. సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, సీఈవో జగదీష్, ఏఈవో దుర్గాభవాని, వీరబాబు, శ్రీను, నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, భాస్కర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ రాధ

పీజీ కళాశాల విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాల విద్యార్థులు 13 మంది అర్థశాస్త్ర విభాగంలో బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ తెలిపారు. ఆయా విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించిన ఆయన మాట్లాడారు. 2016 నుంచి 2021 విద్యాసంవత్సరాలలో యూనివర్సిటీ టాపర్లుగా నిలిచిన తమ విద్యార్థులు ఇటీవల కేయూ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు స్వీకరించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నంద్రు బాబురావు, ఎస్‌కే.బాజీ, నరసింహారావు, అశోక్, కాంచన, కావ్య, రమ్య, హతీరాంనాయక్, నాగార్జున, దీప్తి, ఉమను అభినందించగా అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోదుగు శ్యాంబాబు, అధ్యాపకులు తడికమళ్ల శేఖర్, జగజీవన్‌రావు, చలపతిరావు ఉన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: ప్రముఖ సంస్థ టెక్ స్కై కంపెనీ సోమవారం కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో తమ విద్యార్థులు 41 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. టెక్ స్కై సీనియర్ హెచ్‌ఆర్ యస్.రవితేజ, హెచ్‌ఆర్ యస్.దుర్గాప్రసాద్, ఇమిగ్రేషన్ స్పెషలిస్ట్ టి.నరేష్, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, శ్రీనివాసరావు, శివప్రసాద్, జె.రవీంద్రబాబు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న శోభ

రఘునాథపాలెం: కామేపల్లి మండలం టేకులపల్లికి చెందిన మహిళ హస్లీని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వేపకుంట్లలో సోమవారం జరిగిన ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ సమావేశానికి కార్యదర్శి ఇమ్మడి చైతన్య అధ్యక్షత వహించగా జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ మాట్లాడారు. హస్లీని నమ్మించి తీసుకెళ్లిన వ్యక్తి హత్య చేయడం గర్హనీయమన్నారు. ఈ సమావేశంలో ఆవుల అనిత, బానోత్ పద్మ, మేక రేణుక, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..



పార్క్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ నీరజ

ఓపెన్ జిమ్, పార్క్‌కు శంకుస్థాపన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 27వ డివిజన్ శ్రీనివాసనగర్ నందు ఓపెన్ జిమ్, పార్క్ ఏర్పాటు పనులకు మేయర్ పునుకొల్లు నీరజ సోమవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.21 లక్షలతో ఈ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్డ నగేష్, డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ ఎస్‌డీ షమ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ షెడ్ నిర్మాణ పనులు పరిశీలన..

లకారం ట్యాంక్‌బండ్‌పై నిర్మిస్తున్న డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ షెడ్ నిర్మాణ పనులను మేయర్ పరిశీలించారు.

ట్రేడ్ లైసెన్సులపై అవగాహన..

నగరంలోని ప్రతీ వ్యాపార సముదాయానికి ట్రేడ్ లైసెన్సు తప్పనిసరని, వ్యాపారులకు ఆ లైసెన్సు ఉందా.. లేదా అనేది వార్డు ఆఫీసర్లు పరిశీలన చేయాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు కేఎంసీలో వార్డు ఆఫీసర్లకు ట్రేడ్ లైసెన్సుల జారీపై అవగాహన కల్పించారు. డివిజన్ స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల జారీ వేగవంతం చేయాలని సూచించారు.

సీనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు..

- ఇన్‌చార్జి ఆర్ఐగా ఉన్నప్పుడు ఆరోపణలు
- డబుల్ అసెస్‌మెంట్ల నేపథ్యాన చర్యలు

కేఎంసీలో రెవెన్యూ విభాగం అధికారులపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలకు ఉపక్రమించారు. ఒకే ఇంటికి డబుల్ అసెస్‌మెంట్ నంబర్లు, భవనానికి తక్కువ పన్ను విధింపు వంటి కారణాలతో సీనియర్ అసిస్టెంట్ జ్యోతిని సస్పెండ్ చేస్తూ కేఎంసీ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డబుల్ అసెస్‌మెంట్‌పై జుజ్జురు సత్యనారాయణ తన ఇంటి నంబర్‌పై మరో వ్యక్తిని యజమానిగా చూపిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు ఓ ఆస్పత్రి భవన కొలతలను తక్కువగా చూపి, ఎలాంటి ఫైల్ లేకుండా ఆన్‌లైన్‌లో తక్కువ పన్ను విధిస్తూ నంబర్ కేటాయింపు జరిపించారని ఫిర్యాదులు కమిషనర్‌కు అందాయి. వీటిపై అధికారులు విచారణ చేసి, నాటి ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.జ్యోతికి కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాటికి జ్యోతి ఇచ్చిన సమాధానం సక్రమంగా లేదంటూ తాజాగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక డబుల్ అసెస్‌మెంట్‌లను డిలిట్ చేయాలని, డీమ్డ్ అయిన వాటిని పునఃపరిశీలన చేసి వాటికి కేటాయించిన నంబర్లను రద్దు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. కాగా రెవెన్యూ విభాగంపై ఎక్కువ ఫిర్యాదులు వస్తుండడంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు కొందరిని ఇక్కడ నుండి ఇతర మున్సిపాలిటీలకు పంపించారు. అలాగే ఫిర్యాదులపై విచారణలు చేయించి నివేదికలు తీసుకున్నారు.

నివాళి..



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్ మాతృమూర్తి రాజేశ్వరి మృతిచెందగా సోమవారం మమతరోడ్డులోని రాజశేఖర్ ఇంటి వద్ద ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు నాగమల్లేశ్వరరావు, రాంబాబు, నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందంజ

కామేపల్లి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు అన్నారు. సోమవారం పలు పాఠశాలల్లో సంఘం మండల అధ్యక్షుడు పిట్టల రాములు అధ్యక్షతన సభ్యత్వ నమోదు, జనరల్ ఫండ్ క్యాంపియన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న మెడికల్, సరెండర్ లీవ్, జీపీఎఫ్ బిల్లులు విడుదల చేయాలని, డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. కేవీ రమణ, బాలాజీ, సతీష్, కోటేశ్వరరావు, వెంకట్, వెంకట్‌రెడ్డి, హరిప్రసాద్, గుడిపూడి శ్రీనివాసరావు, వెంకన్న, జైబా, మురళీధర్‌రెడ్డి, హరికృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.



సభ్యత్వాలను స్వీకరిస్తున్న శేఖర్‌రావు

కాల్వ కోసం తవ్వారు.. విస్మరించారు



ఓ పక్క పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాల్వ..



మరో పక్క మురుగునీరు వెళ్తూ..

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని దోరేపల్లి సీతయ్యనగర్-1 డ్రెయినేజీ కోసం రోడ్డుకు ఇరువైపుల కాల్వను నిర్మించేందుకు తవ్వారు కాని ఏళ్ల గడుస్తున్న కాల్వను నిర్మించడం మాత్రం అధికారులు విస్మరించారు. దోరేపల్లి సీతయ్యనగర్-1, 2, 3 ప్రాంతాల డ్రెయినేజీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండగా కాల్వ తవ్వి త్వరలో నిర్మాణం చేపడతామని అధికారులు హామీ ఇచ్చిన ఇంత వరకు అమలుకు నోచుకోకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క తవ్విన కాల్వలోనే మురుగు నీరు ప్రవహిస్తుంది. మరోపక్క మాత్రం ఇళ్లు లేకపోవడంతో ఖాళీగా తవ్విన కాలువలో పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇప్పటికైనా కాలువను నిర్మించి ఆప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్.ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 8184
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957